

డయల్ యువర్ ఎస్‌పికి 13 వినతులు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్



ప్రజల సమస్యను పరిష్కరించేందుకు ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ ఏర్పాటు చేసిన డయల్ యువర్ ఎస్‌పి కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా ప్రారంభించారు. మొదటి రోజు 13 వినతులు రాగా ఈ సమస్యల పరిష్కారానికి ఎస్‌పి తక్షణం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి సతీష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి మంగళవారం డయల్ యువర్ ఎస్‌పి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సమస్యలు విన్నవించుకునేందుకు ప్రతి మంగళవారం బాధితులు 0884- 2371744 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

ప్రతికూలంగా ఖరీఫ్ సాగు

- కానరాని వాన చినుకు
- విత్తనాలు పడని మెట్ట పొలాలు
- దిక్కు తోచని స్థితిలో రైతులు



పిఠాపురంలోని మల్లాంలో నీరు లేక దున్ని వదిలేసిన పొలం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నైరుతి రుతుపవనాల రాకలో జాప్యం వల్ల జిల్లాలో ఖరీఫ్ పంట సాగుపై ప్రతికూల ప్రభావం పడుతుందని రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా ఏటా జూన్ రెండో వారంలో తొలకరి వర్షాలు మొదలవుతాయి. అప్పటికే పొలాలను దుక్కి దున్ని సిద్ధం చేసిన రైతులు మెట్ట భూముల్లో అపరాలు, చిరుధాన్యాలు, నూనె గింజలు, కూరగాయ పంటలను వేస్తుంటారు. కానీ జూన్ మూడో వారం ముగుస్తున్నప్పటికీ చినుకు జాడ లేకపోవడం, పైగా ఎండలు తీక్షణంగా కాస్తుండడంతో ఖరీఫ్ సాగు జాప్యం అవుతుతోంది.

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు లక్షకు పైగా హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా. జిల్లాలో ప్రధాన పంట వరి. దీన్ని దాదాపు 92 వేల హెక్టార్లలో పండిస్తుంటారు. చెరకు 3,755 వేల హెక్టార్లలో ఉంటుంది. మిగిలిన భూముల్లో మినుము, పెసర, వంటి అపరాల పంటలు, చోడి, జొన్న, సజ్జ వంటి చిరు ధాన్యాలు, నువ్వు వేరుశనగ వంటి నూనె గింజల పంటలు, పలురకాల కూరగాయ పంటలు పండిస్తుంటారు. చోడి, మొక్కజొన్న హెక్టార్లు, సజ్జ (గంటి) హెక్టార్లు, నువ్వు, కంది, వేరుశనగ, హెక్టార్లు, మినుమ 5 వేలకు పైగా హెక్టార్లలో పంటను సాగు చేస్తున్నారు. వరిలో దాదాపు 20 శాతం, చెరకులో 30 శాతం, మిగిలిన పంటల్లో దాదాపు 800 శాతం వర్షాధారంగానే రైతులు సాగు చేస్తున్నారు. ఏటా జూన్ మొదటి, రెండో వారంలో తొలకరి వర్షాలు మొదలవుతాయి. అప్పటికే భూములను సిద్ధం చేసుకున్న రైతులు పంటలను విత్తుతుంటారు. సాధారణం ప్రస్తుత సమయానికి వర్షాధారంగా పండించే వరి, చెరకు, అపరాలు, చిరుధాన్యాలు, నూనెగింజల పంటలు వేసే పనుల్లో అన్నదాతలు నిమగ్నమై ఉంటారు. ఇదే సమయంలో నీటి ఆధారంగా వరి పండించే భూములను దుక్కి దున్ని, పచ్చి రొట్ట విత్తనాలు చల్లుతుంటారు.

ఈ ఏడాది వాతావరణం పూర్తి భిన్నంగా ఉంది. సుమారు ఆరు వారాల నుంచి వేసవి తీవ్రత అధికంగా వుండడం, రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడం, వర్షాల జాడ లేకపోవడంతో ఖరీఫ్ సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడలేదని రైతులు ఆందోళన రైతులు ఆందోళన చెందుతున్నారు. అడపాదడపా చెదురుమదురుగా జల్లులు పడుతున్నాయే తప్ప కుండపోతగా వర్షం పడిన దాఖలాలు లేవు. దీంతో సాధారణ సమయంతో పోలిస్తే ఖరీఫ్‌లో మెట్ట పంటల సాగు మూడు నుంచి నాలుగు వారాలు ఆలస్యం అయ్యే అవకాశం అభిప్రాయపడుతున్నారు. కనీసం ఇంజన్లతో తోటను తడుపుకుందామన్నా ఎండిపోతుండడంతో రైతులకు పాలుపోవడంలేదు. చెరకు మొక్క తోటల కోసం విత్తనం సిద్ధం చేసుకున్న రైతులు వర్షాల కోసం రెండు వారాల నుంచి ఎదురు చూస్తున్నారు. దీంతో చెరకు దవ్వ (మొక్క తోట) నాట్లు ఆలస్యమవుతాయని, దీనివల్ల చెరకు కట్టింగ్ జాప్యం అవుతుందని, ఫలితంగా దిగుబడి తగ్గుతుందని రైతులు అంటున్నారు.

ఎండిపోతున్న నువ్వు, కార్శీ చెరకు

జలాశయాలు, చెక్ డ్యాములు, గ్రోయిన్ల ఆధారంగా వరి సాగు చేసే భూముల్లో వేసవి పంటగా పలువురు రైతులు నువ్వు వేస్తుంటారు. ఈ ఏడాది కూడా నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో గత మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన వర్షాలతో చాలా మంది రైతులు నువ్వు పంట వేశారు. తొలుత ఆశాజనకంగానే పెరిగిన నువ్వు మొక్కలు, గత నెల రోజుల నుంచి ఎండలు తీక్షణంగా కాస్తుండడం, చినుకు జాడ లేకపోవడంతో ఎండిపోతున్నాయి. వర్షాధారంగా సాగు చేసే కార్శీ చెరకు తోటల పరిస్థితి కూడా ఇలానే ఉంది.

రాజకీయ స్వార్థం కోసం మతాన్ని వాడుకోను

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్, తాళ్లరేవు



సమావేశంలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

'ఎవరు ఏ మతాన్ని నమ్మినా ఏ దేవుడిని పూజించినా ఎవరికీ ఇబ్బంది లేదు. కేవలం రాజకీయాల కోసం మతాన్ని వాడుకునే వారితోనే అందరికీ ఇబ్బంది' అని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. వారాహి విజయ యాత్రలో భాగంగా మంగళవారం కాకినాడలో ముస్లిం ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. భారతదేశంలో ముస్లిములు ఏనాటికీ మైనార్టీలు కాదని, ఈ దేశం మనందరిదీ అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ అధికారంలోకి వస్తే ముస్లిముల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా, ఉపాధి అవకాశాలు పెరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భారత దేశంలో సమాజం వేరు, రాజకీయ పార్టీలు వేరని, మైనార్టీలు అనగానే సంపూర్ణంగా అవకాశాలు ఉండవనే భావన మొదట మనసుల్లో నుంచి తొలగించాలన్నారు. ఏ మతంలోనైనా విపరీతవాదాన్ని అందరం ముక్త కంఠంతో ఖండించాలని పవన్ కోరారు. గత ఎన్నికల్లో ముస్లిములు వైసిపి పూర్తిగా నమ్మి మద్దతు ఇచ్చారన్నారు. బిజెపి మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకొస్తామని చెప్పిన ఆ నాయకుడు ఢిల్లీ వెళ్లి ఏం వంచుతున్నాడో అందరికీ తెల్సున్నారు. రంజాన్ పవిత్ర మాసంలో ముస్లిం ప్రతినిధులకు ఇఫ్తార్ ఇవ్వడంతో పాటు ఇస్లాం విద్య, ధార్మిక సంస్థల అభివృద్ధికి రూ.25 లక్షలు విరాళం ఇచ్చానని గుర్తు చేశారు.

పవన్ కల్యాణ్‌కు ఘన స్వాగతం

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేపట్టిన వారాహి యాత్రకు తాళ్ళరేవు మండలంలో ఘన స్వాగతం లభించింది. చొల్లంగి, గురజనాపల్లి జంక్షన్‌లో పవన్ కళ్యాణ్ అభిమానులు స్వాగతం పలికారు. జామకాయల తూము సెంటర్ వద్ద జి.వేమవరం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు ఆధ్వర్యంలో వేలాదిమంది అభిమానులు, ప్రజలు పవన్ కళ్యాణ్‌కు స్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చారు. ఈ జంక్షన్‌లో పవన్ కళ్యాణ్ కారు టాప్ పైకి ఎక్కి అభివాదం చేయడంతో అభిమానులు ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. సుంకరపాలెం జంక్షన్లో జనసేన పార్టీ మండల అధ్యక్షులు అత్తిలి బాబూరావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. తాళ్ళరేవు పెట్రోల్ బంకు వద్ద అభిమానులు, పార్టీ కార్యకర్తలు కోలాహలం కనబడింది. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.

జన జీవన ప్రతిబింబం యాసలపు సాహిత్యం

ప్రజాశక్తి - పెద్దాపురం



సూర్యారావుకు నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాకవి యాసలపు సూర్యారావు తన ప్రజా జీవితంలో భాగంగా కథలను కూడా భాగస్వాముల్ని చేశాడని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అన్నారు. యాసలపు సూర్యారావు 11వ వర్ధంతి సందర్భంగా స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో డాక్టర్ జోస్యుల కృష్ణ బాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సూర్యారావు అన్ని రంగాల్లోనూ ప్రజాభిమానాన్ని పొందరన్నారు. ప్రముఖ కవి, రచయిత అద్దేపల్లి ప్రభు మాట్లాడుతూ గురజాడ దిద్దుబాటు కథ నుండి నేటి ఆధునిక కథ వరకు కథా రచనలో వచ్చిన మార్పులను వివరించారు. చల్లా విశ్వనాథం మాట్లాడుతూ యాసలపు సూర్యారావుతో తనకున్న అనుబంధాన్ని వివరించారు. ఈ సభలో మార్ని జానకి రామ చౌదరి, కొత్త శివ, గంగారత్నం, పూడి శ్రీనివాస్, రొంగల వీర్రాజు, కేదారి నాగు మాట్లాడారు. తొలుత యాసలపు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభలో ప్రజా నాట్య మండలి కళాకారులు దారపురెడ్డి కృష్ణ, రొంగల వీర్రాజు, దారపు రెడ్డి సత్యనారాయణ, అమత, నమ్రత బందం అభ్యుదయ గీతాలు ఆలపించారు.



హుండీల లెక్కింపులో ఛైర్మన్, ఇఒ

సత్యదేవుని ఆదాయం రూ.2.86 కోట్లు

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి హుండీల ఆదాయం రూ.2,86,21,018 లభించింది. మంగళవారం కొండపైన సత్యదేవుని నిత్య కళ్యాణ మండపం ఆవరణలో దేవస్థానం ఇఒ ఎస్.ఆజాద్, చైర్మన్ ఐవి.రోహిత్ పాలక మండలి సభ్యుల సమక్షంలో దేవస్థానం అధికారులు 46 రోజుల్లో వచ్చిన వివిధ హుండీల్లో వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. ఈ లెక్కింపులో నగదుతోపాటు 65 గ్రాముల బంగారం, 570 గ్రాముల వెండి, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ లభించింది. ఈ లెక్కింపులో ఎసి రమేష్ బాబు, ఇఒ సిసి వాసు పాల్గొన్నారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పవన్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మంగళవారం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె రాజకీయ ప్రస్థానం బడుగు బలహీనవర్గాలకు, ముఖ్యంగా మహిళలకు ఆదర్శమని పేర్కొన్నారు. సామాన్య కుటుంబాలకు చెందిన వ్యక్తులు కూడా రాష్ట్రపతి వంటి అత్యున్నతమైన పదవులను అలంకరించవచ్చని ముర్ము నిరూపించారన్నారు. ఆమెకు ఆరోగ్యంతో కూడిన సంపూర్ణ ఆయుష్షును ప్రసాదించాలని జనసేన పార్టీ తరఫున మనస్ఫూర్తిగా కోరుకుంటునట్లు తెలిపారు.

ఉత్తమ గురుకుల విద్యార్థులకు సత్కారం


ప్రజాశక్తి-కాకినాడ రూరల్, పెద్దాపురం

రూరల్ మండలం పి.వెంకటాపురంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల 10వ తరగతి విద్యార్థిని దడాల జ్యోత్స్న విజయవాడలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ద్వారా పురస్కారం అందుకుంది. రూ.లక్ష చెక్, బంగారు పతకం, మెమెంటో, సర్టిఫికెట్‌లను విద్యార్థిని అందుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ టి.సుశీల తెలిపారు. రాష్ట్రంలోని 185 గురుకులాల్లో 589 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు. పెద్దాపురం సుధా కాలనీలోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు అభినందన సభలో 10 వ తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ ఎర్నెస్ట్ సికెపి అధ్యక్షతన జరిగిన ఈ అభినందన సభలో ప్రథమ స్థానం పొందిన జెట్టి విజయ ప్రకాష్‌కు రూ.5 వేలు, ద్వితీయ స్థానం సాధించిన కలమాట చరణ్ తేజకు రూ.3 వేలు, తృతీయ స్థానం సాధించిన బోనం సమూయేలుకు రూ.2 వేలు నగదు, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ పాలని బాలాజీ, ఉపాధ్యాయులు ఆర్.నాగేశ్వరరావు, కె.హరిబాబు, ఎన్.సత్యవతి, కె.నాని బాబు, కె.సిరి ప్రకాష్, బి.మల్లికార్జున్, డి.ఈశ్వరరావు, ఎన్.రామకష్ణ, ఆర్.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కొరత రానివ్వం

ప్రజాశక్తి-కాజులూరు

ప్రజలకు తాగునీరు పూర్తిస్థాయిలో అందిస్తామని మంజేరు సర్పంచ్ గుంటూరు అప్పారావు అన్నారు. కొద్ది రోజులుగా మంజేరు గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడడంతో స్పందించిన సర్పంచ్ అప్పారావు శిథిలమైన బావిని రూ.40 వేలతో అభివద్ధి చేయడంతో గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు తొలగాయన్నారు. పైప్‌లైన్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నప్పటికీ అక్కడక్కడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు.



అవార్డు అందుకుంటున్న విద్యార్థి లక్ష్మణ్

ఆదిత్య విద్యార్థి లక్ష్మణ్‌కు అవార్డు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్‌కు చెందిన ఎన్.సత్యలక్ష్మణ్‌కు స్టేట్ ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. సిఎం వైఎస్.జగన్ ద్వారా అవార్డు అందుకున్నట్లు ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.సుగుణా రెడ్డి తెలిపారు. విజయవాడలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో రూ.50 వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందించారన్నారు. విద్యార్థి తల్లితండ్రులను, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ కుమార్‌ను సిఎం సత్కరించారు. తమ విద్యార్థి అవార్డు గెలుపొందడం ఆనందంగా ఉందని సుగుణారెడ్డి తెలిపారు. లక్ష్మణ్‌ను, వారి తల్లిదండ్రులు ఎన్.వెంకట రమణ, ఎన్‌వికె.అన్నపూర్ణను, ఉపాధ్యాయ సిబ్బందిని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, సెక్రటరీ ఎన్.కృష్ణ దీపక్ రెడ్డి అభినందించారు.

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కాజులూరు

కుష్టు వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని పిహెచ్‌సి వైద్యాధికారి ఎన్.సౌజన్య అన్నారు. మంగళవారం పిహెచ్‌సిలో సిబ్బందికి, ఆశా వర్కర్లకు, వాలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 20 రోజుల పాటు 11 బృందాలు ఇంటింటి సర్వే చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించి అవసరమైన చికత్స అందిస్తారని తెలిపారు. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి మందుల ద్వారా చికత్స అందించి పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ వైకుంఠరావు, సత్యనారాయణ, సిబ్బంది రాజారావు, శ్రీనివాస్, ప్రకాష్, సత్తిబాబు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా సత్యనారాయణ

ప్రజాశక్తి -రౌతులపూడి

రౌతులపూడి తహశీల్దారు ఎల్.శివకుమార్ తుని బదిలీ కావడంతో డిప్యూటీ తహశీల్దారు సత్యనారాయణను పూర్తిస్థాయి బాధ్యతలతో ఇన్‌ఛార్జి తహశీల్దారుగా నియమిస్తూ మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని సత్యనారాయణ విలేకరులకు తెలిపారు.

క్రిస్టియన్ కౌన్సిల్ కార్యవర్గం ప్రమాణం

ప్రజాశక్తి-కాకినాడ, కార్పొరేషన్



నియామక పత్రాలను అందజేస్తున్న ద్వారంపూడి

కాకినాడ రాయల్ పార్క్ హోటల్లో ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎఐసిసి రాష్ట్ర కార్యదర్శి విక్టర్ శామ్యూల్ అధ్యక్షత వహించగా ఉపాధ్యక్షుడు జోసఫ్ బెన్నీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జెహెచ్ హెూలేన్ మాట్లాడారు. నూతన కార్యవర్గానికి సిటీ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నియామక పత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రైస్తవులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సోనీవుడ్, శామ్యూల్ సాగర్, ఏల్చూరి పాపారావు, ఎంఎస్.విలియమ్స్, జాషువా గూటం, కెజి.కుమార్, మోజెస్ బాబు, రిక్కి గూటం, స్టీఫెన్ ఆనంద్, సౌమ్యా సుమలత తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'





మహాసభలో పాల్గొన్న నాయకులు

జిజిహెచ్ మెస్ వర్కర్స్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో మంగళవారం మెస్ వర్కర్స్ యూనియన్ మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎ.సూరి శంకర్ అధ్యక్షునిగా, అనపర్తి ఏడుకొండలు కార్యదర్శిగా, షేక్‌మెన్ శ్రీనివాస్ ఉపాధ్యక్షునిగా, తణుకు వీరబాబు సహాయ కార్యదర్శిగా, సురేష్, దొరబాబు, ఐ.వీరభద్రం, దుర్గమ్మ కమిటీ సభ్యులుగా మహాసభ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభలో సిఐటియు నాయకులు పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, మలక రమణ పాల్గొన్నారు.

పవన్ సవాల్ స్వీకరిస్తారా : ఎంఎల్‌ఎ ద్వారంపూడి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడ నగరంలో తనపై పోటీ చేసి గెలవాలని తాను విసిరిన సవాల్‌కు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలని ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు, ఎంఎలఎ కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కన్నబాబు, ఎంపీ వంగా గీతతో కలిసి ఆయన మాట్లాడారు. కాకినాడ బహిరంగ సభలో పవన్ కళ్యాణ్ తనపై చేసిన వ్యక్తిగత దూషణలు, ఆరోపణలను నిరూపించి, కాకినాడ నగరం నుంచి 2024లో తనపై పోటీ చేసి గెలవమని సవాల్ చేసిన విషయం గుర్తు చేసారు. సవాల్ స్వీకరించకపోతే, సభలో మాట్లాడిన మాటలు, ఆరోపణలు అబద్ధం అని ప్రజలు గ్రహిస్తారన్నారు. జనసేన పార్టీకి చంద్రబాబు తప్ప జెండా, అజెండా లేదని ఎద్దేవా చేశారు. తన వ్యాఖ్యలపై కందుల దుర్గేష్, పంతం నానాజీ, ముత్తా శశిధర్ సమాధానం చెప్పడంపై స్పందిస్తూ మీరు పోటీ చేయడానికి సీటు ఉందో, లేదో తెలుసుకోవాలని సూచించారు. పవన్ కళ్యాణ్ ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. తనకు, తన కుటుంబానికి అండగా నిలిచిన ముద్రగడ పద్మనాభానికి కతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీ వంగా గీత మాట్లాడుతూ వారం రోజులుగా వారాహి యాత్రలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్న మాటలు అభ్యంతరకరంగాఉన్నాయన్నారు. ప్రజా సమస్యలపై, యువతకు దిశానిర్దేశం ఇస్తారని చాలామంది ఆశించారని కానీ అందుకు భిన్నంగా ఈ యాత్ర జరుగుతోందన్నారు. కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు మాట్లాడుతూ రాజకీయాలలో వ్యక్తిగత విమర్శలు చేయడం పరిపాటిగా మారిందని, దీంతో సమాజం అనేక సమస్యలను ఎదుర్కొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ ఆత్మ పరిశీలన చేసుకుని తాను మాట్లాడే భాష మార్చుకోవాలన్నారు. అవసరం కోసం రాజకీయాలు చేయడం, అప్పుడప్పుడు యాత్రలు చేయడం పవన్ కల్యాణ్‌కే చెల్లిందన్నారు. కుడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న, జెడ్‌పిటిసి నులుకుర్తి రామకృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.

రైజ్ అమలుకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కాకినాడ

విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉద్దేశించిన రడీనెస్ ఇనీషియేటివ్ ఫర్ సిచ్యుయేషనల్ ఇంగ్లీష్ (రైజ్) కార్యక్రమాన్ని జగ్గంపేట నియోజకవర్గంలో అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కోర్టుహాల్‌లో రైజ్ కార్యక్రమంపై ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది ఆగస్టు 1న తుని నియోజక వర్గంలోని పాఠశాలల్లో రైజ్ ప్రాజెక్టును ప్రారంభించామని తర్వాత దశలవారీగా కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్, పిఠాపురం నియోజకవర్గాల్లోని పాఠశాలల్లో అమలు చేసినట్లు తెలిపారు. సరళీకత విధానాల ద్వారా ఇంగ్లీష్ స్పీకింగ్ నైపుణ్యాలను పెంపొందించే రైజ్ కార్యక్రమం మంచి ఫలితాలు ఇస్తున్నందున త్వరలో జగ్గంపేట నియోజకవర్గంలోనూ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. విద్యార్థులకు అందించేందుకు ప్రత్యేకంగా నిపుణులు రూపొందించిన రైజ్ మాడ్యూల్ పుస్తకాలను సిద్ధం చేయాలన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలోని జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లో కూడా రైజ్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ఎస్ఎస్‌సి ఫలితాల ఆధారంగా గుర్తించిన పాఠశాలల విద్యార్థుల్లో గణిత నైపుణ్యాలను కూడా పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కతికా శుక్లా సూచించారు. ఈ సమావేశంలో డిఇఒ కెఎన్‌విఎస్.అన్నపూర్ణ, రైజ్ కార్యక్రమ కో ఆర్డినేటర్ జివి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ పరికరాలు ప్రారంభం

కాకినాడ : కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో అధునాతన ఫిజియోథెరపీ పరికరాలను అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. మంగళవారం ఫిజియోథెరపీ బ్లాక్‌లో జెమిని ఎడిబుల్ ఆయిల్ సంస్థ సిఎస్ఆర్ నిధులు రూ.3.75 లక్షలతో సమకూర్చిన ఫిజియోథెరపీ నూతన పరికరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి రోజూ ఆరోగ్య అవసరాల నిమిత్తం వేలాదిమంది ప్రజలు వస్తుంటారని ఫిజియోథెరపీ విభాగం ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ఈ నూతన ఫిజియోథెరపీ పరికరాలు అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఒ పి.త్రినాథ్, సూపరింటెండెంట్ డాక్టర్ డి.హేమలతా దేవి, ఆర్ఎంఒలు డాక్టర్ అనిత, డాక్టర్ రాహుల్, సిఎస్ఆర్ ఎంఒ డాక్టర్ పుష్కరరావు, డాక్టర్ యమున, ఫిజియోథోరపీ విభాగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అద్దెల బకాయిలపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి -కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రావిరాల మహేష్ కుమార్ రెవెన్యూ విభాగం అధికారులతో అద్దె బకాయిలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. షాపుల యొక్క లీజుదారులు మూడు నెలలకు మించి అద్దె బకాయిలు తక్షణం చెల్లింపులు చేసేలా ఆయన అధికారులకు సూచించారు. వందశాతం జూన్ నెలాఖరులోగా వసూలు చేయాలని కోరారు. వర్షాకాలాన్ని దష్టిలో ఉంచుకుని తీసుకోవలసిన చర్యలపై ఇంజినీరింగ్ విభాగం, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు.

రెవెన్యూ కార్యాలయంలో ఆర్‌డిఒ తనిఖీ

ప్రజాశక్తి- కరప

కరప మండల రెవెన్యూ కార్యాలయాన్ని బుధవారం ఆర్‌డిఒ ఎన్‌వివి.సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. డిప్యూటీ తహశీల్దార్ అనిల్, ఆర్ఐ మాచరరావు, విఆర్ఒలు కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పెనుకుదురులో జగనన్న భూ సర్వేలో భాగంగా సరిహద్దు రాళ్లను పరిశీలించారు. నడకుదురులో సచివాలయ భవనాలను పరిశీలించారు. ప్రభుత్వం చేస్తున్న భూ సర్వే సత్వరమే పూర్తి చేసి రైతులకు అందించాలన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి లతా కుమారి

సామాజిక మాధ్యమాల్లో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-కోటనందూరు

అపరిచిత వ్యక్తులతో ఫేస్బుక్ వాట్సాప్ ద్వారా పరిచయాలు పెంచుకోవడంతో మహిళలు ప్రమాదంలో పడుతున్నారని డిఎస్‌పి కె..లతాకుమారి అన్నారు. మంగళవారం రాత్రి తుని పట్టణంలో బ్యాంక్ కాలనీలో సిఐ ఎం.నాగ దుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించిన వారధి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజలు పోలీసులతో స్నేహభావం కలిగి ఉండాలని, మీ చుట్టుపక్కల ఎటువంటి సంఘవిద్రోహ కార్యక్రమాలు నిర్వహించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు లోనవుతున్నారని, మత్తులో మహిళలపై అత్యాచారాలు, దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సత్యనారాయణ రాజు, చింతకాయల ప్రసాద్, కౌన్సిలర్ చింతకాయల భారతి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గోదావరిలో దూకి యువకుని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -మామిడికుదురు

కొమరాడకు చెందిన యువకుడు చెల్లింగి నాగ ప్రసాద్ మంగళవారం పాశర్లపూడి వారధి పైనుండి వైనతేయ నదిలోకి దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న నగరం ఎస్ఐ షేక్ జానీ బాషా తన సిబ్బందితో నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. నాగ ప్రసాద్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. తాపీ మేస్త్రీగా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషంచేవాడు. ఆర్థిక పరమైన ఇబ్బందులు, కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం పాల్పడినట్లు పలువురు భావిస్తున్నారు.

లారీని బైకు ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-గోపాలపురం

లారీని బైకును ఢీకొని ఇద్దరు యువకులు గాయపడిన సంఘటన గోపాలపురం బైపాస్ రోడ్‌లో మంగళవారం చోటు చేసుకుంది. దేవరపల్లి మండల కొత్తగూడెం గ్రామానికి చెందిన ప్రగడ భూపతి సందీప్ కుమార్, సంఘ నేటి సాయిధర్మ తేజ స్నేహితులతో కలిసి జంగారెడ్డిగూడెం మద్ది ఆంజనేయ స్వామి గుడికి వెళ్లి దైవ దర్శనం చేసుకుని తిరిగి వస్తున్నారు. గోపాలపురం బైపాస్ రోడ్డులో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వీరి బైకు ఢీకొట్టడంతో వీరిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు.

మందుబాబుల తోపులాట ఒకరు మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

అధికంగా మద్యం సేవించిన ఇద్దరు మందుబాబుల మధ్య తోపులాట ఒకరి ప్రాణాన్ని బలి తీసుకుంది. కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాస్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యానాం కురసంపేట గ్రామానికి చెందిన నిమ్మకాయల సురేష్ (48) జార్జిపేట నివాసి దాసరి నాగరాజు యానాం సరిహద్దులో పాత వంతెన సమీపంలో కూర్చుని మద్యం సేవించారు. మద్యం మత్తులో ఉన్న ఇద్దరూ వెటకారాలు ఆడుకుంటూ తోసుకోవడంతో సురేష్ అదుపు తప్పి వెనక్కి పడి పోయాడు. ఈ ఘటనలో సురేష్ తలకు తీవ్ర గాయం అయింది. స్థానికులు హుటాహుటిన యానం జిజిహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. సురేష్‌కు భార్య, ముగ్గురు సంతానం. మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మద్యం బాటిల్స్ స్వాధీనం

ప్రజాశక్తి-గోపాలపురం

బైకుపై మద్యం బాటిల్స్ తరలిస్తున్న ఇద్దరురిపై కేసు నమోదు చేసి మద్యం బాటిల్ సీజ్ చేసినట్లు సిఐ డి.సుధ తెలిపారు. గోపాలపురం శివారులో కోడిగుడ్ల అట్ల ఫ్యాక్టరీ వద్ద కొత్తపల్లి కుమార్ రాజేష్, దొండ్రు మంగరాజు నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం బాటిల్స్ తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ పి.సుధీర్, పుష్ప, గిరిబాబు పాల్గొన్నారు.

యానాం వార్తలు


గవర్నర్ తమిళ్‌సైతో మాట్లాడుతున్న స్పీకర్, ఎంఎల్ఎ

హైవేలో మద్యం దుకాణాలు మూసివేయాలి

ప్రజాశక్తి - యానాం

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు యానాం పరిధిలోని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న మద్యం దుకాణాలను తక్షణమే మూసివేయాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ లెఫ్టినెంట్ గవర్నర్ తమిళసై సౌందర్య రాజన్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం స్పీకర్ సెల్వంతో కలిసి గవర్నర్ తమిళసైకు పలు సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అశోక్ మాట్లాడుతూ యానాంలో విచ్చలవిడిగా మద్యం దొరకడం వల్ల అతిగా తాగుడికి బానిసై వందలాది అమాయకులు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. యానాంలో మద్యం దుకాణాల పర్మిట్లు అధికంగా ఉన్నాయని వాటిని తగ్గించాలని కోరారన్నారు. ఇప్పటికే పుదుచ్చేరికి సంబంధించి సుప్రీంకోర్టు జాతీయ రహదారుల్లో 500 మీటర్ల లోపు మద్యం దుకాణాలు ఉండకూడదని ఆదేశించిందన్నారు. తక్షణమే యానాంలో దుకాణాలు తొలగించాలన్నారు. మూతపడిన రీజెన్సీ పరిశ్రమ, ఇతర ఫ్యాక్టరీలను తెరిపించి యానాంలో ఉన్న కార్మికులను, నిరుద్యోగ యువతను ఆదుకోవాలని కోరారన్నారు.

యానాం మీదుగా పవన్ కల్యాణ్ రోడ్‌షో

ప్రజాశక్తి - యానాం

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కాకినాడ వారాహి యాత్రను ముగించుకుని యానాం బైపాస్ మీదుగా ముమ్మిడివరం చేరుకున్నారు. ఈ నేపథ్యంలో బైపాస్ జంక్షన్ యానాం ముఖ ద్వారం వద్ద రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేశారు. హారతులతో మహిళలు ఘన స్వాగతం పలికారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి అభిమానులు ఆయన కోసం ఎదురు చూశారు. పవన్ కళ్యాణ్ రాకతో అభిమానుల్లో సందడి వాతావరణం నెలకొంది.

డ్రైన్‌ల నిర్వహణపై ఎంఎల్ఎ ఆగ్రహం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట మున్సిపాల్టీలో డ్రైన్‌ల నిర్వహణ అస్తవ్యస్తంగా అధ్వానంగా ఉందని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా వైసిపి ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను రానున్న కాలంలో పరిష్కరించేందుకు వీలుగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రజల్లోకి వెళుతున్నట్టు తెలిపారు. సామర్లకోట పట్టణంలో గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ఐదు తూముల వరకు మేజర్ డ్రైన్ పూడికతో నిండిపోగా మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా వైసిపి పాలనలో తమ పార్టీ ప్రతిపక్షంగా ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తుందన్నారు. దారిలో భాగంగానే ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు ప్రజలకు వెళ్లి సమస్యలను గుర్తించి వాటిపై ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. దానికిగాను రాష్ట్రాన్ని ఐదు జోన్లుగా విభజించి ఐదుగురు ఇన్‌ఛార్జిలను వాటిపై నియమించినట్లు చెప్పారు. తనకు వచ్చిన జోన్‌లో భాగంగా 34 నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. ఆ నియోజకవర్గాలన్నిటిలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని నివేదిక తయారు చేయనున్నట్లు చెప్పారు. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో ఈ కార్యక్రమాన్ని జులై ఆరో తేదీన చేపడుతుండగా దానికి తగిన ఏర్పాట్లు ఇప్పటికే పార్టీ నుంచి చేస్తున్నట్టు చెప్పారు. ఇదిలా ఉండగా సామర్లకోట పట్టణం అంతటి నుంచి వచ్చే వ్యర్థ, మురిగి జలాలు ఏలేరు డ్రైన్‌లో కలిసేందుకుగాను ఇటీవల తుపాను కారణంగా మేజర్ డ్రైన్‌లో చెట్లు విరిగిపడి నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉండగా వాటిని తక్షణమే తొలగించాలని, దానిపై నిర్లక్ష్య వైఖరిని వీడాలని ఎంఎల్ఎ డిమాండ్ చేశారు. సామర్లకోట - పెద్దాపురం పట్టణాలకు ప్రధాన తాగునీటి వనరుగా ఉన్న గోదావరి కాలువలో పలు గ్రామాలకు చెందిన డ్రైనేజీ, వ్యర్థ జలాలు కలుస్తూ ప్రమాదకరంగా మారుతున్నందున వాటిని అరికట్టాలన్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో గోదావరి జలాలను ఎంతో పవిత్రంగా కాపాడి తాగునీటి కోసం ఫిల్టర్ బెడ్ చెరువులు నింపేవారమని, ప్రస్తుతం ఆ జలాలు వ్యర్థ జలాలతో కలిసి హానికరంగా మారుతున్నాయని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్, తాతపూడి కృష్ణబాబు, బలుసు వాసు, గొల్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మను దర్శించుకున్న దొరబాబు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు మరిడమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామ్మోహనరావు దొరబాబుకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వృద్ధుల సమస్యలపై పవన్‌కు వినతి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

స్థానిక హాలికన్ ట్రైమ్స్ క్లబ్‌లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నిర్వహించిన సమావేశంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణ రాజు వద్దుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడంతో వద్దుల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. పిల్లలు దూరప్రాంతాలలో ఉద్యోగాలు చేయడంతో ఒంటరిగా జీవిస్తున్నారన్నారు. వద్ధాప్యం కారణంగా ఆర్థిక సమస్యలతో పాటు ఆరోగ్య సమస్యలతో కూడా సతమతమవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్ పాల్గొన్నారు.

అడబాలకు ఉత్తమ పురస్కారం

కాకినాడ రూరల్ : బోట్ క్లబ్ వాకర్స్ సంఘ అధ్యక్షునిగా చేస్తున్న పలు సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా వాకర్స్ ఉత్తమ అధ్యక్షుడిగా అంతర్జాతీయ వాకర్స్ సంఘం అందించిన పురస్కారాన్ని పవన్ కళ్యాణ్ ద్వారా అడబాల అందుకున్నారు. స్థానిక హాలికాన్ ట్రైమ్స్ క్లబ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు అడబాల తెలిపారు. ఆరోగ్య సదస్సులు, వైద్య శిబిరాలు నిర్వహించినందుకు పురస్కారం లభించిందన్నారు.

వైసిపి విద్యా విభాగం అధ్యక్షునిగా అనిల్

ప్రజాశక్తి-కాకినాడ రూరల్


కన్నబాబుతో అనిల్

వైసిపి కాకినాడ జిల్లా విద్యా విభాగం అధ్యక్షునిగా సర్పవరం గ్రామానికి చెందిన పూసల అనిల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయంలో ఆయనను కలుసుకుని కతజ్ఞతలు తెలిపారు. అనంతరం డైనమిక్ డైరెక్టర్ కురసాల కళ్యాణి కష్ణను నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, గాలి దేవర బాలాజీ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి వారిని సత్కరించారు. ఈ సందర్భంగా కురసాల కళ్యాణ కృష్ణ మాట్లాడుతూ ఇచ్చిన పదవిని సద్వినియోగం చేసుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సారా రాజేష్, బొండాడ పండు, మాత వెంకటరమణ, దాసరి రామచంద్రరావు, జగన్, జి.రాజేష్, బన్ను, పూసల సత్యనారాయణ, ఇంజరపు నైస్, పి.నరేష్ బాబు పాల్గొన్నారు.

ఎంపిపి రాజ్యలక్ష్మి ఫిర్యాదుపై విచారణ

రౌతులపూడి : ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మిపై ఇటీవల తనపై ఆమె పార్టీ అయిన వైసిపికే చెందిన నాయకులు దాడి చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో డిఎస్‌పి బి.అప్పారావు మంగళవారం విచారణ చేపట్టారు. దాడికి సంబంధించిన వివరాలను స్థానికులు, సాక్షులను అడిగి తెలుసుకున్నారు. దాడి జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని డిఎస్‌పి అప్పారావు తెలిపారు.

నారుమడి, విత్తన శుద్ధిలో మెలకువలు అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రస్తుత సార్వా సీజన్‌లో వరి పండించే రైతులు నారుమడి తయారీలో, విత్తన శుద్ధిలో మెలకువలు పాటించాలని వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ పి.మునిరామయ్య, డాక్టర్ సిహెచ్‌వి.నరసింహారావు తెలిపారు. విత్తన శుద్ధి తర్వాతనే నాటాలన్నారు. కిలో విత్తనానికి కార్బన్డిజం 25 శాతం, మాన్కోజిబ్ 50 శాతం మిశ్రమానికి శిలీంద్ర నాసిని రెండు గ్రాములు చొప్పున లీటర్ నీటికి కలిపి కిలో విత్తనానికి పట్టించాలన్నారు. పొడి విత్తన శుద్ధికైతే శిలీంధ్ర నాసినిని నాలుగు గ్రాములు చొప్పున వినియోగించాలన్నారు. నారు మడిని 12 నుండి 15 రోజుల వ్యవధిలో మూడు దఫాలు దమ్ము చేసి చదును చేయాలన్నారు.

జన జాగృతి సభ విజయవంతానికి వినతి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

ఎంఆర్‌పిఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే జన జాగృతి సభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య పిలుపు నిచ్చారు. స్థానిక పెన్షన్ లైన్‌లో జన జాగతి సభ పోస్టర్‌ను జిల్లా నాయకులు వల్లూరి నాని ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ లక్ష్యాలను సాధించేందుకు సిద్ధం అవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిడిపి స్టాలిన్, వల్లూరి సత్యవతి, కొమ్ము చినబాబు, పైడిమల్ల జాషువా, నందిక చక్రం, ముప్పిడి భూలక్ష్మి, మిరియాల సాగర్, మల్లెల మహేష్, ఎండుగపల్లి రవికుమార్, వేలంగి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

దొరబాబును కలిసిన ఎంఇఒలు

సామర్లకోట రూరల్ : కొత్తగా సామర్లకోట, పెద్దాపురంలో రెండో ఎంఇఒలుగా నియమితులైన పి.పుల్లయ్య, ఎన్ఆర్‌కె.చౌదరి మంగళవారం ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దాపురం నియోజక వర్గం వైసిపి ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. సామర్లకోట క్యాంప్ కార్యాలయంలో వారు దొరబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జలజీవన్‌తో ప్రతి ఇంటికీ రక్షిత నీరు

ఆలమూరు : కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి రక్షితనీరు అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకొంటున్నామని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డిఎల్‌వి.నరసింహారావు, ఎంపిడిఒ కె.జాన్ లింకన్, ఆర్‌డబ్ల్యూస్ జెఇ ఎం.పోచమ్మ అన్నారు. జొన్నాడ గ్రామ సచివాలయంలో మంగళవారం సర్పంచ్ కట్టా శ్రీనివాస్ అధ్యక్షతన పథకం అమలుపై అవగాహనా సదస్సు వారు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముందుగా పథకం తీరుతెన్నులపై సమీక్షించారు. ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు పరిచేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో అరికట్ట వచ్చని వారు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో ఉపయోగించే నీటిని పరీక్షించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ఎఫ్ డబ్ల్యూఎస్ టీం లీడర్ ఎన్.చిట్టిబాబు, చాంద్ ఎన్‌జిఒ భాస్కరావు, కృష్ణ మోహన్, మాజీ సర్పంచ్ డి.దొరబాబు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పాలన గాడి తప్పింది

ప్రజాశక్తి-కోటనందూరు


కొత్తూరులో పర్యటిస్తున్న యనమల దివ్య

రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందని టిడిపి తుని నియోజకవర్గ ఇన్చార్జ్ యనమల దివ్య అన్నారు. మంగళవారం హెచ్.కొత్తూరులో మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి ప్రకటించిన మేనిఫెస్టోను ప్రతి ఇంటికి వివరిస్తూ ముందుకు సాగారు. ప్రజా సమస్యలను వింటూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో యనమల కష్ణుడు, యనమల శివరామకృష్ణ, పోలనాటి శేషగిరి, మోతుకూరి వెంకటేష్, కొండ్రు నాగేశ్వరరావు, సుర్ల లోవరాజు, ఉలికి సూరిబాబు, కె.నాగ సత్యనారాయణ, గాది వరహాల బాబు, రాంబాబు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

పాత పెద్దాపురంలో మూడు రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమై నిరాశ్రయులైన కుటుంబాన్ని మంగళవారం హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పరామర్శించారు. అనంతరం ఆయన రూ.10 వేలు ఆర్థిక సాయంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. స్థానిక బొమ్మ యూత్ సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.ఐదు వేల నగదు, బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు మల్లి బాబు, శ్రీధర్, అరవింద్ నాయుడు, జగత్ తేజ, రాంబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.